# ఊంఛాహార్ ప్రేలుళ్ళు | కార్మికుల ఘోరమైన పనిపరిస్థితులు

**ఉత్తరప్రదేశ్** రాష్ట్రం, రాయబరేలీలో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టిపిసి) ఆధ్వర్యంలోని ఊంఛాహార్ థర్మల్ విద్యుత్తు కేంద్రంలో 2017 నవంబర్ 1న జరిగిన ఘోర "ప్రమాదంలో" 43 మంది కార్మికులు దుర్మరణం చెందగా, మరో వందమంది కార్మికులు గాయపడ్డారు. పాలక రాజకీయ నాయకులు ఈ ఘటనపట్ల తీవ్ర దిగ్భ్రాంతిని, తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఒక విచారణ కమిటీని నియమించారు. ఈ విధంగా ఈ ఘటన వార్త తాలూకువున్న విలువ క్రమంగా మసకబారి పోయింది. కార్మికుల పని ప్రదేశాల్లోని 'ప్రమాదాల' ప్రతి సందర్భంలోనూ జరుగుతున్నదిదే.

థర్మల్ విద్యుత్తు కేంద్రంలోని 6వ యూనిట్‌లో వత్తిడి అధికంగా వుండే బాయిలర్‌లో ప్రేలుడు కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాయిలర్‌ను పూర్తిగా మూసివేయకపోవటం వలన, అది సరిగా పనిచేయలేదు. దీనివలన పోగుపడిన బూడిదను శుభ్రం చేయవలసిందిగా కార్మికులను ఆదేశించారు. బాయిలర్‌లో పీడన అధికమవటం వలన అది ప్రేలిపోయింది. ఘటన జరిగిన సందర్భంలో బాయిలర్‌లోనూ, పరిసరాల్లోనూ దాదాపు 300 మంది కార్మికు లున్నారు. భద్రతా చర్యలన్నీ చేపట్టివుంటే, చాలా తేలికగా నివారింప దగిన ప్రమాదం ఇది. కార్మికుల ప్రాణాలపట్ల, భద్రతపట్ల యాజమాన్యాల ఘోరమైన నిర్లక్ష్యాన్ని ఈ ఘటన వెల్లడిచేస్తోంది.

ఎన్‌టిపిసి ఒక ప్రభుత్వరంగ సంస్థ అయినప్పటికీ, కార్మికులకవసరమైన భద్రతా ప్రమాణాలన్నీ పాటించి తీరుతుందని లేదు. దేశవ్యాపితంగా ఎన్‌టిపిసి 48 థర్మల్ విద్యుత్ కేంద్రాలను నడుపుతోంది. ఖచ్చితమైన భద్రతా విధానాలను ఆ సంస్థ తప్పనిసరిగా కలిగి వుండాలి. వాస్తవానికి అలా కలిగివుంది కూడా. కానీ, ఆ ప్రమాణాలన్నింటినీ ఉత్పత్తి పెంపుదల కోసం ఉద్దేశపూర్వకంగా ప్రక్కనబెట్టారు.

ఈ ప్రమాదంలో మరణించిన లేదా గాయ పడిన వారిలో అత్యధికులు, ఓ కాంట్రాక్టరుద్వారా ఎన్‌టిపిసి పనిలో పెట్టుకున్న కాంట్రాక్టు వలస కార్మికులే. ప్రభుత్వరంగ సంస్థలతో సహా అనేక పరిశ్రమలు తమ కార్మికులకు రక్షణను, భద్రతా ప్రమాణాలను కల్పించే బాధ్యతనుండి తప్పు కోవటానికి దీనికి ఒక కపటోపాయంగా ఉపయోగిస్తున్నాయి. కార్మికులందరికీ కాంట్రాక్టరు ద్వారా ఉద్యోగం కల్పించబడింది కావున, ఆ కార్మికులు పనిచేస్తున్న పరిశ్రమకు, ఆ కార్మికులకు సంబంధించిన ఎలాంటి బాధ్యతా లేదని వారు వాదన చేస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రధాన ఉద్యోగ కల్పనాదారునిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని ప్రక్కనబెట్టి, విస్తారంగా కొనసాగుతున్న ఆచరణ ఈ విధంగానే వుంది. కార్మిక చట్టాలుగా చెప్పబడేవి కానీ, సుప్రీంకోర్టు ఆదేశాలు కానీ నిర్భయంగా ఉల్లంఘించబడుతున్నాయి. నేరం చేసినందుకు శిక్షించవలసిన, చట్టాన్ని పరిరక్షించేవిగా చెబ్తున్న ప్రభుత్వమూ లేదా సంబంధిత సంస్థలు చర్యలు తీసుకుంటాయనే భయం లేకుండా పోయింది.

కార్మికుల భద్రతపట్ల చట్టభీతిలేని ఘోరమైన నిర్లక్ష్యాన్ని వీరు ఎందుకు ప్రదర్శిస్తున్నారు? నూతన ఆర్థిక విధానాల అమలు తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ ధ్వంసంచేసి, దాని స్థానంలో యజమానులు తమచిత్తమొచ్చిన విధంగా కార్మికులను పనిలో పెట్టుకొనే, తొలగించే విధానాన్ని ముందుకు తేవాలని అన్ని వైపులనుండి కేకలు పెడుతున్నారు. అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలన్నీ కూడా ఎడతెగకుండా కార్మిక సంస్కరణలను గురించి మాట్లాడుతున్నాయి. కానీ, ఇదంతా కార్మిక చట్టాలను ఎత్తివేయటం మినహా మరోటి కాదు.

ప్రస్తుతం అధికారంలోవున్న బిజెపి ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను ప్రమాదకర పనులలో ఉపయోగించే వీలుగా 'కాంట్రాక్టు కార్మిక (సవరణ, రద్దు) చట్టం–1970'కి సవరణలను ప్రతిపాదించింది. అలాగే బిజెపి ప్రభుత్వం 'ఫ్యాక్టరీల చట్టం – 1938'కి సవరణలు ప్రతిపాదించింది. ప్రతి సంవత్సరం ఫ్యాక్టరీని తనిఖీ చేయవలసిన పర్యాయాల సంఖ్యను కుదిస్తోంది. చట్టంలో సవరణ చేర్చక మునుపే, బిజెపి ప్రభుత్వం 'శ్రమ్ సువిధ' ఫోర్టల్‌ను ఆవిష్కరించింది. కార్మిక చట్టాల అంగీకారానికి 'స్వీయ ధృవపత్రం ఇస్తే చాలునని దీనిలో పేర్కొన్నారు. ప్రధాన ఉద్యోగ కల్పనాదారుని 'స్వీయ ధృవపత్రాన్ని' అనుమతించే విధంగా బాయిలర్ రెగ్యులేషన్స్–1950 చట్టానికి సవరణలు చేశారు.

పని ప్రదేశంలో ప్రమాదాలు పెరుగుతూ పోతున్న నేపథ్యంలో ఈ సవరణలు జరుగు తున్నాయి. 'సులభతర వ్యాపార' బలిపీఠంపై కార్మికుల ప్రాణాలు, హక్కులు పెట్టబడి వున్నాయి. ఊంఛాహార్ ప్రేలుడు–ప్రతి సంవత్సరం దేశవ్యాపితంగా జరుగుతున్న 'పారిశ్రామిక ప్రమాదాల'లో ఒకటి మాత్రమే. వేలాదిమంది కార్మికులు ఈ ప్రమాదాలలో తమ ప్రాణాలు కోల్పోతున్నారు. కార్మికవర్గం, తన వర్గ పోరాటాల ద్వారా మాత్రమే తాము బలవంతంగా నెట్టబడుతోన్న ఈ ప్రమాదకర పరిస్థితులను మార్చుకోగలుగుతారు.

ooooo